## యాదగిరీశుడికి వైభవంగా దర్బార్ సేవ


అమ్మవారికి హారతి ఇస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, జూలై 19 : యాదగిరి గుట్ట లక్ష్మీనరసింహస్వామివారి దర్బార్ సేవోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. శుక్రవారం ప్రధానాలయం ముఖ మండపంలో ఉత్సవమూర్తులను దివ్య మనోహరంగా అలంకరించి సేవోత్సవాన్ని నిర్వహించారు. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. నిజరూప దర్శనంలో స్వయంభూ నారసింహస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. ప్రధానాలయం మొదటి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం జరిపిన అనంతరం స్వామి, అమ్మవార్లను దివ్య మనోహరంగా ముస్తాబు చేసి గజ వాహనంపై వేంచేపు చేసి వెలుపలి ప్రాకార మండపంలో కల్యాణోత్సవ సేవను ఊరేగించారు. స్వామి, అమ్మవార్లకు నిత్య తిరుకల్యాణోత్సవం అత్యంత వైభవంగా సాగింది. లక్ష్మీసమేతుడైన నారసింహుడిని ఆరాధిస్తూ సుమారు గంటన్నరకు పైగా నిత్య తిరు కల్యాణ తంతును జరిపారు. ప్రధానాలయ ముఖ మండపంలో స్వామివారికి ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులతో సువర్ణ పుష్పార్చన జరిపించారు. బంగారు పుష్పాలతో దేవేరులకు అర్చన చేశారు. అండాళ్ అమ్మవారికి ఊంజల్ సేవ నేత్ర పర్వంగా సాగింది. సాయంత్రం ప్రధానాలయంలో కొలువుదీరిన ఆండాళ్ అమ్మవారిని పట్టువస్త్రాలు, బంగారు, ముత్యాలు, వజ్రాభరణాలతో దివ్య మనోహరంగా అలంకరించిన అర్చకులు తిరువీధుల్లో ఊరేగించారు. ఆస్థాన విద్వాంసుల మంగళ వాయిద్యాలు, మహిళా భక్తుల మంగళ నీరాజనాల నడుమ ఊంజల్ సేవోత్సవం వైభవంగా సాగింది. పాతగుట్ట స్వామివారికి నిత్యారాధనలు సాగాయి. సుమారు ఆరు వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకుని స్వామివారి ఖజానాకు రూ.11,36,167 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

## ఆందోళ్ మైసమ్మ వార్షికోత్సవాలు ప్రారంభం


ఆందోళ్ మైసమ్మ వార్షికోత్సవంలో భాగంగా బోనాలతో భక్తులు

చౌటుప్పల్ రూరల్, జూలై 19 : మండలంలోని దండు మల్కాపురం గ్రామంలో గల ఆందోళ్ మైసమ్మ దేవాలయ 19వ వార్షికోత్సవాలను గణపతి పూజ, స్వస్తీవాచనంతో శుక్రవారం ప్రారంభించారు. మూడు రోజుల పాటు జరిగే ఈ వార్షికోత్సవాల్లో మొదటి రోజు గ్రామ శాలివాహనులు అమ్మవారికి బోనాలను సమర్పించారు. కార్యక్రమంలో శాలివాహన సంఘం అధ్యక్షుడు సిలివేరు వెంకటేశ్, మాజీ ఉప సర్పంచ్ మల్కాజిగిరి కృష్ణ, గౌరవాధ్యక్షుడు మల్కాజిగిరి బాబు, నర్సింహ, కాశయ్య, రమేశ్, అంజయ్య, పాపయ్య పాల్గొన్నారు.

## ముత్యాల లక్ష్మమ్మకు మాజీ ఎమ్మెల్యే నివాళి


లక్ష్మమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డి

భూదాన్ పోచంపల్లి, జూలై 19 : భువనగిరి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ నాయకుడు ముత్యాల మహిపాల్‌రెడ్డి మాతృమూర్తి లక్ష్మమ్మ ఇటీవల మృతిచెందారు. శుక్రవారం నిర్వహించిన ఆమె దశదిన కర్మకు మాజీ మంత్రి ఎలిమినేటి ఉమామాధవరెడ్డి, మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి హాజరై లక్ష్మమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో మాజీ ఎంపీపీ మాడ్గుల ప్రభాకర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ కోట పుష్పలతా మల్లారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ పాక వెంకటేశ్ యాదవ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పాటి సుధాకర్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.

## అసాంఘిక శక్తులకు సహకరిస్తే కఠిన చర్యలు

- యాదగిరిగుట్ట పట్టణ సీఐ రమేశ్


సమావేశంలో మాట్లాడుతున్న సీఐ రమేశ్

యాదగిరిగుట్ట, జూలై 19 : అసాంఘిక శక్తులకు సహకరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని యాదగిరిగుట్ట పట్టణ సీఐ రమేశ్ హెచ్చరించారు. యాదగిరిగుట్ట పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం పట్టణానికి చెందిన లాడ్జీల ఓనర్లు, వర్కర్లతో సమావేశం ఏర్పాటు చేసి పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఆధార్ కార్డు, అడ్రస్ లేకుండా లాడ్జీల్లో రూమ్‌లు తీసుకుని డ్రగ్స్, గుట్కా, గంజాయి విక్రయాలు చేపడుతున్నట్లు తమకు సమాచారం వచ్చిందన్నారు. అలాంటి వారితో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆధార్ కార్డు లేనివారికి, మైనర్లకు రూమ్‌లు ఇవ్వవద్దని, ప్రతిఒక్కరి సమాచారాన్ని రిజిష్టర్‌లో నమోదు చేసుకుని భద్రపర్చాలని అన్నారు. రాత్రివేళ రోడ్లపైకి ఎవరినీ అనుమతినివ్వరాదని, లాడ్జి వద్ద సీసీ కెమెరాలను అమర్చాలని సూచించారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఏమైనా ఘటనలు చోటు చేసుకుంటే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని అన్నారు.

## పద్మ బ్రాహ్మణ పురోహిత సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా పాండురంగశాస్త్రి


పాండురంగశాస్త్రి

యాదగిరిగుట్ట, జూలై 19 : పట్టణంలోని అఖిల భారత భక్త మార్కండేయ పద్మశాలి నిత్యాన్నదానం సత్రంలో పద్మ బ్రాహ్మణ పురోహిత సంఘం రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి రాష్ట్రంలోని 33 జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు హాజరయ్యారు. వర్కాల సూర్యనారాయణ, పద్మశాలి అన్నదాన సత్రం సభ్యులు శ్రీశైలం, గోశిక యాదగిరి, భద్రాచలానికి చెందిన పద్మశాలి నిత్యన్నదాన సత్రం అధ్యక్షుడు కత్తుల సుదర్శన్ ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. అన్ని జిల్లాల అధ్యక్షుల సూచనలు, సలహాలు, అభిప్రాయలను పరిగణలోకి తీసుకుని రాష్ట్ర అధ్యక్షుడిగా శ్రీరుద్ర పాండురంగశాస్త్రిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశానికి సంఘం గౌరవాధ్యక్షుడు వెల్దండ ఓంకారం, గౌరవ సలహాదారుడు ఆడేపు హరీశ్, అఖిల భారత వేద పాఠశాలల అధ్యక్షుడు పాశికంటి ధనుంజయ, అఖిల భారత పద్మశాలి నిత్యన్నదాన సత్రం కార్యనిర్వాహక అధ్యక్షుడు దీకొండ జోగయ్య, నాగభూషణం, దేవదాసు, శ్రీనివాస్, మల్లేశం, సూర్యనారాయణ పాల్గొన్నారు.

## స్టీరింగ్ విరిగి రోడ్డు పక్కకు దూసుకెళ్లిన స్కూల్ బస్సు

రామన్నపేట (వలిగొండ), జూలై 19 : మండలంలోని దుప్పెల్లి గ్రామ సమీపంలో స్కూల్ బస్సు స్టీరింగ్ విరిగి రోడ్డు పక్కకు దూసుకెళ్లింది. పక్కనే ఆగిపోవడంతో బస్సులో ప్రయాణిస్తున్న 20 మంది విద్యార్థులు పెను ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డారు. మోత్కూర్ పట్టణంలోని సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ బస్సు రోజు మాదిరిగానే దుప్పెల్లి గ్రామానికి వచ్చి విద్యార్థులను ఎక్కించుకొని పాఠశాలకు బయల్దేరింది. కొద్ది సేపటికే దుప్పెల్లి గ్రామ శివారులో బస్సు స్టీరింగ్ ఒక్కసారిగా విరిగిపోయి రోడ్డుపక్కకు దూసుకెళ్లింది. దీంతో విద్యార్థులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. బస్సు పక్కనే ఆగడంతో వారంతా సురక్షితంగా బయటపడ్డారు.

## నకిరేకల్, నల్లగొండకు బస్సులు నడపాలి : సీపీఎం

అడ్డగూడూరు, జూలై 19 : అడ్డగూడూరు నుంచి నకిరేకల్ మీదుగా నల్లగొండకు బస్సు సౌకర్యం కల్పించాలని సీపీఎం నాయకులు వల్లంభట్ల శ్రీనివాస్‌రావు కోరారు. శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. మానాయికుంట – గురజాల మధ్య మూసీ నదిపై వంతెన నిర్మాణం చేయడం వల్ల రహదారి వసతి ఏర్పడిందన్నారు.

మండల పరిసర గ్రామాల ప్రజలు వ్యాపారాలు, ఇతర అవసరాల కోసం నిత్యం నకిరేకల్, నల్లగొండకు ప్రయాణం సాగిస్తున్నారని తెలిపారు. ప్రజల ఇబ్బందులను గుర్తించి ఆర్టీసీ అధికారులు బస్సు వసతి కల్పించాలని కోరారు.

## దోమలు వ్యాప్తి చెందకుండా పారిశుధ్య చర్యలు చేపట్టాలి

- కలెక్టర్ హన్మంతు కె.జెండగే


శారాజీపేటలో నీటి తొట్టిని శుభ్రం చేయాలని సూచిస్తున్న కలెక్టర్ హన్మంతు కె.జెండగే

ఆలేరు రూరల్, జూలై 19 : దోమలు వ్యాప్తి చెందకుండా డ్రై డే, పారిశుధ్య కార్యక్రమాలు పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ హన్మంతు కె.జెండగే ఆదేశించారు. డ్రై డే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని శారాజీపేటలో పరిసరాలను పరిశీలించి గ్రామస్తులతో మాట్లాడారు. నీటి తొట్లలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. పారిశుధ్య నిర్వహణ పక్కాగా ఉండాలని, నీటి నిల్వ ఉండే ప్రాంతాలను గుర్తించి పూడ్చాలని సూచించాన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా కార్యాచరణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం జడ్పీహెచ్ఎస్ పాఠశాలను సందర్శించి వసతులను పరిశీలించారు. విద్యార్థులతో పాఠాలు చదివించారు. చదువులో వెనుకబడిన పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ప్రధానోపాధ్యాయుడు జ్యోతిరాజుకు సూచించారు. ఆయన వెంట ఎంపీడీఓ సత్యానంద్ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి స్వప్న ఉన్నారు.

## ఆరుట్ల ఫౌండేషన్ సేవలు అభినందనీయం

- సీపీఐ జాతీయ కౌన్సిల్ సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి


సర్టిఫికెట్లు అందజేస్తున్న సీపీఐ జాతీయ కౌన్సిల్ సభ్యుడు వెంకట్‌రెడ్డి

రాజాపేట, జూలై 19 : పేదలకు ఉపాధి కోసం ఆరుట్ల ఫౌండేషన్ అందిస్తున్న సేవలు అభినందనీయమని సీపీఐ జాతీయ కౌన్సిల్ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని మీనాక్షి ఫంక్షన్‌హాల్లో ఆరుట్ల కమలారామచంద్రారెడ్డి ఫౌండేషన్, స్వామి రామనందతీర్థ రూరల్ ఇన్‌స్టిట్యూట్ సహకారంతో శిక్షణ పొందిన ఆరు వందల మందికి టైలరింగ్, ఎంబ్రాయిండింగ్, కంప్యూటర్ సర్టిఫికెట్లను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరుట్ల కమలాదేవీరాంచంద్రారెడ్డి సాయుధ పోరాట స్ఫూర్తితో ఫౌండేషన్ ద్వారా సేవలు అందించడం హర్షించదగ్గ విషయమన్నారు. 1998లో ఆరుట్ల ఫౌండేషన్ ప్రారంభించి ఇప్పటికి 2500 మందికి ఉచితంగా వివిధ రంగాల్లో శిక్షణ ఇచ్చినట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు ఆరుట్ల సుశీలాదేవి తెలిపారు. కార్యక్రమంలో శిక్షకుడు కృష్ణ విహార్, నాయకులు గోదా శ్రీరాములు, ఊట్కూరి అశోక్ గౌడ్, సట్టు తిరుమలేశ్, రాజయ్య, లింగం, వెంకటేశ్, ప్రశాంత్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, మమత పాల్గొన్నారు.

## ఫొటో ఎగ్జిబిషన్ పోస్టర్ ఆవిష్కరణ


ఫొటో ఎగ్జిబిషన్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజు

చౌటుప్పల్, జూలై 19 : హైదరాబాద్ ఎల్బీనగర్‌లోని కేబీఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఈ నెల 26, 27, 28 తేదీల్లో నిర్వహించే ఫొటో ఎగ్జిబిషన్‌కు సంబంధించిన పోస్టర్‌ను మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫొటో, వీడియో గ్రాఫర్ల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో రవి, సాయిలుగౌడ్, విశ్వనాథ్, చంద్రశేఖర్, గణేశ్, రామచంద్రారెడ్డి, రమేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

## రైతన్నలు అప్రమత్తంగా ఉండాలి : ఎస్‌ఐ ఉపేందర్

రాజాపేట, జూలై 19 : రైతు రుణమాఫీ నేపథ్యంలో సైబర్ నేరగాళ్లు మోసం చేసే అవకాశం ఉన్నందున రైతన్నలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ ఉపేందర్‌యాదవ్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం సైబర్ నేరాలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోసపూరిత మెసేజ్‌లు వస్తే ఓపెన్ చేయొద్దని, బ్యాంకు ఖాతా ఏటీఎం వివరాలు ఎవరికీ చెప్పొద్దని అన్నారు. అలాంటి వివరాల కోసం ఎవరైనా ఫోన్ చేస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ ప్రకాశ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

### సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి : ఎస్‌ఐ కృష్ణయ్య

ఆత్మకూరు(ఎం) : సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ కృష్ణయ్య అన్నారు. ప్రభుత్వం చేపట్టిన రైతు రుణమాఫీ నేపథ్యంలో కొందరు సైబర్ నేరస్తులు మోసపూరిత లింక్‌లు పంపిస్తున్నారన్నారు. నకిలీ వాట్సప్ అకౌంట్‌ను సృష్టిస్తున్నారని తెలిపారు. ఇలాంటి వాటిని టచ్ చేసినా, డౌన్‌లోడ్ చేసినా నేరస్తుల కంట్రోల్‌కు వెళ్లిపోతుందన్నారు. సైబర్, ఆన్‌లైన్ మోసాలకు గురైతే వెంటనే 1930 నెంబర్‌కు కాల్ చేయాలని సూచించారు.

## ఇంట్లో నగదు, నగలు మాయం.. పోలీసులకు ఫిర్యాదు

- ఇంట్లోనే లభ్యమైన సొమ్ము

రామన్నపేట (వలిగొండ), జూలై 19 : ఇంట్లో పెట్టిన నగలు, నగదు కనిపించకపోవడంతో దొంగలు పడ్డారన్న అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. మండలంలోని దాసిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన నారి లింగస్వామి ఇంట్లో బీరువాలో దాచి ఉంచిన నగలు, నగదు కనిపించకపోవడంతో గాబరా పడిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చి లింగస్వామిని విచారించగా ఇంట్లో దాచి ఉంచిన 14 తులాల బంగారు అభరణాలు, 30 తులాల వెండి, 2 లక్షల రూపాయలు కనిపించడంలేదని చెప్పాడు. ఉదయం వ్యవసాయ పనికి వెళ్లి ఇంటికి వచ్చేసరికి బీరువాలోని వస్తువులు చిందరవందరగా పడి ఉండటాన్ని గమనించాడు. ఫిర్యాదు అందుకున్న రామన్నపేట సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ మహేందర్ లాల్, పోలీస్ సిబ్బంది, క్లూస్ టీం, డాగ్‌స్కాడ్‌తో వచ్చి విచారణ చేపట్టారు. లింగస్వామి తల్లి మల్లమ్మ మరోచోట పెట్టి మర్చిపోయినట్లుగా గుర్తించి అక్కడ చూడగా నగదు, నగలు లభ్యమయ్యాయి. దాంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

## రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లేకపోవడం బాధాకరం

- ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి శాంతికుమార్

గుండాల, జూలై 19 : రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి నెలలు గడుస్తున్నా నేటికీ విద్యాశాఖకు మంత్రిని కేటాయించకపోవడం బాధాకరమని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పుల శాంతికుమార్ అన్నారు. మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ వసతి గృహాల్లో సమస్యలు తిష్ట వేశాయన్నారు. ప్రభుత్వం స్పందించి వసతి గృహాలకు పర్మినెంట్ వార్డెన్లను నియమించాలని డిమాండ్ చేశారు. గుండాల బీసీ బాలుర వసతి గృహ అధికారి కిరణ్ సమయపాలన పాటించడం లేదని, విద్యార్థులకు అందుబాటులో ఉండకుండా విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. మల్లెపాక జానీ, చిప్పలపల్లి చరణ్, తరాల సాయి ఉన్నారు.

మోత్కూరు : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఏఐఎస్ఎఫ్ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి శాంతికుమార్ మాట్లాడుతూ పాఠశాలలో మూత్రశాలలు, బాత్‌రూమ్‌లు శుభ్రంగా లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. లైబ్రరీ వసతి లేదని తెలిపారు. ఖాళీగా ఉన్న స్వీపర్ పోస్టును భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చందు, వినయ్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

## ధర్మారెడ్డిపల్లిపై కొత్త బ్రిడ్జి నిర్మించాలి : సీపీఎం



పురాతన బ్రిడ్జిని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

రామన్నపేట (వలిగొండ), జూలై 19 : మండలంలోని వర్కట్‌పల్లి గ్రామ పరిధిలో ధర్మారెడ్డిపల్లిపై ఉన్న పురాతన బ్రిడ్జిని తొలగించి కొత్త వంతెన నిర్మాణం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి డిమాండ్ చేశారు. సీపీఎం పోరుబాటలో భాగంగా శుక్రవారం వర్కట్‌పల్లి – ప్రొద్దటూర్ గ్రామాల మధ్య ధర్మారెడ్డిపల్లి కాల్వపై ఉన్న పురాతన బ్రిడ్జిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిథిలావస్థకు చేరిన పాత బ్రిడ్జిని తొలగించి కొత్తది నిర్మించాలన్నారు. వర్కట్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పాముకాటు, కుక్కకాటుకు వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో నాయకులు మెట్టు రవీందర్‌రెడ్డి, గూడూరు బుచ్చిరెడ్డి, చేగూరి నర్సింహ, మల్లేశం, కిష్టయ్య, రాములు, మల్లయ్య, అశోక్ పాల్గొన్నారు.

### 108లో ప్రసవం.. తల్లీబిడ్డ క్షేమం

భువనగిరి అర్బన్, జూలై 19 : భువనగిరి పట్టణానికి చెందిన నిండు గర్భిణి శాంతి ప్రసవం కోసం శుక్రవారం భువనగిరి ఏరియా దవాఖానకు వచ్చింది. వైద్యులు పరీక్షలు నిర్వహించి రక్తహీనత ఉన్నదని హైదరాబాద్ గాంధీ దవాఖానకు రెఫర్ చేశారు. దాంతో 108 అంబులెన్స్‌లో తీసుకెళ్తుండగా, మార్గమధ్యలో పగిడిపల్లి గ్రామ సమీపంలో నొప్పులు ఎక్కువయ్యాయి. అంబులెన్స్ సిబ్బంది సుఖ ప్రసవం చేయగా.. ఆడబిడ్డ జన్మించింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌నాయక్ మృతి

బీబీనగర్, జూలై 19 : రోడ్డు ప్రమాదంలో మాజీ సర్పంచ్ సునావత్ శ్రీనివాస్ నాయక్ మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నీల్లతండా గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ సునావత్ శ్రీనివాస్ నాయక్ గురువారం తన గ్రామం నుంచి ద్విచక్ర వాహనంపై బీబీనగర్‌కు వెళ్లారు. పని ముగించుకుని గ్రామానికి వస్తున్న క్రమంలో బీబీనగర్ సమీపంలో ప్రమాదవశాత్తు రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టాడు. దీంతో ఆయన ముఖానికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందారు. శ్రీనివాస్ భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఎన్.రమేశ్ తెలిపారు. శుక్రవారం మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు మృతదేహానికి నివాళులర్పించి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ యర్కల సుధాకర్‌గౌడ్, నాయకులు బొక్క జైపాల్‌రెడ్డి, రాచమల్ల శ్రీనివాసులు, చింతల సుదర్శన్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి ఉన్నారు.

### ఆరు గొర్రెల అపహరణ..

యాదగిరిగుట్ట, జూలై 19 : గుర్తు తెలియని దుండుగులు షెడ్డులోకి చొరబడి ఆరు గొర్రెలను ఎత్తుకెళ్లారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పెద్ద కందుకూరు గ్రామానికి చెందిన గుర్రం ఆంజనేయులు తన ఇంటి వద్ద షెడ్డు వేసి సుమారు వంద గొర్రెలను పెంచుతున్నాడు. గురువారం రాత్రి షెడ్డులోకి గొర్రెలను తోలి ఇంటికి వెళ్లాడు. శుక్రవారం ఉదయం మేత కోసం వెళ్తున్న సమయంలో ఆరు గొర్రె పొట్టేళ్లు కనిపించలేదు. అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు గొర్రెల దొంగతనానికి పాల్పడినట్లు గుర్తించి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. చోరీకి గురైన గొర్రెల విలువ సుమారు రూ.70 వేలు ఉంటుందని బాధితుడు తెలిపాడు.

### విద్యుదాఘాతంతో మూడు బర్రెలు మృతి

భువనగిరి అర్బన్ 20 : పట్టణంలో విద్యుదాఘాతంతో మూడు పాడి గేదెలు మృతి చెందాయి. పట్టణంలోని కట్ల యాదగిరికి చెందిన బర్రెలు శుక్రవారం హౌసింగ్ బోర్డు కాలనీ వెనుక భాగంలో మేస్తున్న క్రమంలో కిందికి వేలాడుతున్న విద్యుత్ తీగలకు తగిలి షాక్‌తో మృతిచెందాయి. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతోనే బర్రెలు మృతి చెందాయని, సుమారు రూ.3లక్షల నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

### పరస్పర దాడిలో ఇద్దరిపై కేసు నమోదు

గుండాల, జూలై 19 : పరస్పరం దాడులు చేసుకున్న ఘటనలో ఇద్దరిపై కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వస్తాకొండూర్ గ్రామానికి చెందిన చెట్టిపల్లి చంద్రయ్య ఇటీవల పీర్ల పండుగలో డప్పు కొట్టేందుకు అదే గ్రామానికి చెందిన సూరారం ఎల్లమ్మ వద్ద డప్పును తీసుకెళ్లాడు. పండుగ ముగియడంతో శుక్రవారం ఎల్లమ్మకు డప్పు తిరిగి ఇస్తుండగా.. పగులకొట్టి తీసుకొచ్చావని చంద్రయ్యను ఆమె ప్రశ్నించింది. అప్పుడే పగిలి ఉన్నదని చంద్రయ్య చెప్పే క్రమంలో ఇరువురి మధ్య వాదన జరిగింది. ఈ సమయంలో అటుగా వస్తున్న సూరారం సురేశ్.. ఎల్లమ్మ తనకు పెద్దమ్మ అవుతుందని, మహిళతో ఎందుకు గొడవ పడుతున్నావని చంద్రయ్యను ప్రశ్నించాడు. ఆవేశంతో చంద్రయ్య తన చేతిలో ఉన్న గొడ్డలితో సురేశ్ చేతిపై దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన సురేశ్ చంద్రయ్యపై కర్రతో తిరిగి దాడి చేయగా.. తలకు, శరీరంపై గాయాలయ్యాయి. ఈ నేపథ్యలో సురేశ్ భార్య పద్మ, చెట్టిపల్లి చంద్రయ్య పోలీస్‌స్టేషన్‌లో ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నారు. ఇరువురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ సైదులు తెలిపారు.

## 'కరెన్సీ నోట్లపై అంబేద్కర్ ఫొటో ముద్రించాలి'


ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న అంబేద్కర్ ఫొటో సాధన సమితి జాతీయ అధ్యక్షుడు పరశురామ్, నాయకులు

భువనగిరి కలెక్టరేట్, జూలై 19 : రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్ఫూర్తి ప్రదాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఫొటోను కరెన్సీ నోట్లపై ముద్రించేలా పార్లమెంట్‌లో మాట్లాడాలని కరెన్సీపై అంబేద్కర్ ఫొటో సాధన సమితి జాతీయ అధ్యక్షుడు జేరిపోతుల పరశురామ్ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్‌లో ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పరశురామ్ మాట్లాడుతూ 1921లో ఇంపీరియల్ బ్యాంకు కుప్పకూలినప్పుడు 1923లో రూపాయి, దాని సమస్య – పరిష్కార మార్గం అనే పుస్తకాన్ని రాసి హిల్టన్ యంగ్ కమిషన్, సైమన్ కమిషన్, రాయల్ కమిషన్‌కు ఇవ్వడం వల్ల నాడు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాను ఏర్పాటు చేశారని తెలిపారు. అలాంటి అంబేద్కర్ లేకుంటే నేడు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లేదని గుర్తుచేశారు. ఎంపీ మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ ఫొటోను కరెన్సీ నోట్లపై ముద్రించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై, ఆర్బీఐపై ఉన్నదన్నారు. ఈ అంశంపై పార్లమెంట్‌లో ప్రస్తావిస్తానని హామీ ఇచ్చారు. ఈ నెల 29, 30, 31 తేదీల్లో ఢిల్లీ జంతర్ మంతర్‌లో జరిగే మహాధర్నాకు హాజరవుతానని చెప్పారు.

వినతి పత్రం ఇచ్చిన వారిలో సమితి జిల్లా చైర్మన్ కొడారి వెంకటేశ్, గౌరవాధ్యక్షుడు బట్టు రామచంద్రయ్య, జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు బర్రె సుదర్శన్, తెలంగాణ దళిత సేన రాష్ట్ర అధ్యక్షుడు పల్లెర్ల వెంకటేశ్, నాయకులు నల్ల కృష్ణ, కుడుదుల సత్యనారాయణ పాల్గొన్నారు.

## తెగుళ్ల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలి

- పంటలను పరిశీలించిన వ్యవసాయ శాస్త్రవేత్తలు


క్షేత్రస్థాయి పరిశీలనలో వ్యవసాయ శాస్త్రవేత్తలు

మోటకొండూర్, జూలై 19 : ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం చీడపీడల జీవనియంత్రణ విభాగం, ఏరువాక కేంద్రం జిల్లా శాస్త్రవేత్తలు మోటకొండూర్ మండలంలోని సికిందర్‌నగర్, కాటేపల్లి గ్రామాల్లో వరి, పత్తి పంటలను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో పత్తి చేనులో చర్చాగోష్టి నిర్వహించారు. పత్తి రైతులు పంటనాశించే రసం పీల్చు పురుగులైన పచ్చ దోమ, తామర పురుగు, తెల్ల దోమ, పూత, కాయను ఆశించే గులాబీ రంగు, కాయ తొలుచు పురుగుల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. వీటిని జీవనియంత్రణ పద్ధతుల ద్వారా లేదా పురుగు మందులు తక్కువగా వాడి అరికట్టవచ్చని తెలిపారు. అనంతరం రైతులకు లింగాకర్షక బుట్టలను అందజేశారు. కార్యక్రమంలో జీవ నియంత్రణ విభాగం శాస్త్రవేత్త డాక్టర్ ఎ.రామకృష్ణబాబు, ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టర్ అనిల్‌కుమార్, శాస్త్రవేత్త మమత, రైతులు పాల్గొన్నారు.

## అమరావతి కుటుంబానికి బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు పరామర్శ


మాజీ ఎంపీపీ అమరావతి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి

గుండాల, జూలై 19 : ఇటీవల గుండెపోటుతో మృతిచెందిన మాజీ ఎంపీపీ తాండ్ర అమరావతి కుటుంబాన్ని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ఎంపీపీ అమరావతి మృతి పార్టీకి తీరని లోటన్నారు. చిన్న వయస్సులో ఎంపీపీగా బాధ్యతలు చేపట్టి సమర్థవంతంగా నిర్వర్తించారని గుర్తుచేశారు. ధైర్యంగా ఉండాలని ఆమె కుటుంబ సభ్యులకు చెప్పారు. అదేవిధంగా ఇటీవల బైక్ ప్రమాదంలో గాయపడిన మండలంలోని వెల్మజాల బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు సంగి బాలకొమురయ్యను పరామర్శించారు. ఆయన వెంట మోత్కూర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మందడి రామకృష్ణారెడ్డి ఉన్నారు.

## ఆశ వర్కర్లకు పరీక్ష విధానాన్ని రద్దు చేయాలి


ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఆశ వర్కర్లు

భువనగిరి అర్బన్ 19 : ప్రభుత్వం ఆశ వర్కర్లకు పరీక్ష విధానాన్ని రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దాసరి పాండు అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఆశ వర్కర్లు నిరసన తెలిపారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి మాయ కృష్ణ, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కస గోని లలిత, చంద్రకళ, అనిత, శోభ, అరుణ, పావని అనిత, లక్ష్మి పాల్గొన్నారు.

## కల్లు బోనం పోస్టర్ అవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న గౌడ ఐక్య సాధన సమితి నాయకులు

ఆలేరు రూరల్, జూలై 19 : ఆషాఢం బోనాల సందర్భంగా గోల్కొండ కోటలో రేణుకా ఎల్లమ్మ తల్లికి ఈ నెల 23న నిర్వహించే కల్లు ఘటం సాక బోనం పోస్టర్‌ను గౌడ ఐక్య సాధన సమితి నాయకులు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు గణగాని శంకర్ గౌడ్ మాట్లాడుతూ శాఖ బోనం ఉత్సవాలకు గౌడ కులస్తులు అధిక సంఖ్యలో తరలి రావాలన్నారు. కార్యక్రమంలో గౌడ ఐక్య సాధన సమితి రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ బైరి మహేందర్‌గౌడ్, జిల్లా మీడియా కన్వీనర్ దూడల సాగర్, విక్రమ్, సురేశ్, బాలరాజు, అంజయ్య పాల్గొన్నారు.

## ఆధార్ కేంద్రాన్ని అందుబాటులో ఉంచాలి : సీపీఎం

రామన్నపేట, జూలై 19 : మండల కేంద్రంలో ఆధార్ కేంద్రం సేవలను అందుబాటులో ఉంచాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జెల్లెల పెంటయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మూసివేసిన ఆధార్ కేంద్రం వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ లాల్‌బహదూర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలో ఉన్న ఏకైక ఆధార్ కేంద్రాన్ని మూసివేయడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు స్పదించి ఆధార్ కేంద్రం తెరిపించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, నాయకులు ఆనంద్, నరేందర్, హన్మంతు, నగేశ్, బాలరాజు, సైదులు, సోములు, రవీందర్ పాల్గొన్నారు.

### సీఐటీయూ జిల్లా శిక్షణా తరగతులను జయప్రదం చేయాలి

రామన్నపేట (వలిగొండ), జూలై 19 : రామన్నపేటలో ఈ నెల 27, 28 తేదీల్లో నిర్వహించే సీఐటీయూ జిల్లా శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని ఆ సంఘం మండల కన్వీనర్ తుర్కపల్లి సురేందర్ కోరారు. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో శిక్షణా తరగతుల కరపత్రాన్ని శుక్రవారం ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికుల హక్కులను హరిస్తుందన్నారు. కార్మికులకు కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. శిక్షణా తరగతుల్లో అన్ని రంగాల కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. జంగయ్య, నర్సింహ, రాములు, వెంకటేశం, శ్రీరాములు పాల్గొన్నారు.

### షాపు యజమానులు భద్రతా చర్యలు పాటించాలి

- బీబీనగర్ ఎస్‌ఐ నరేశ్

బీబీనగర్, జూలై 19 : షాపు యజమానులు భద్రతా చర్యలు పాటించాలని ఎస్‌ఐ ఎన్.రమేశ్ అన్నారు. శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో వివిధ షాపుల యజమానులతో సమావేశం నిర్వహించి సీసీ కెమెరాల ఏర్పాటు, షాపుల వద్ద భద్రతా ఏర్పాట్లపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షాపుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. అనుమానితుల పట్ల అప్రమత్తంగా ఉండి షాపుల వద్ద భద్రతా చర్యలు పాటించాలని సూచించారు.